# బెట్టుసరి

సంక్రాంతిపండుగ యింకా రెండేరెండు రోజులుంది. పండుగకు క్యాంపు ఎక్కడ పడుతుందా అని ఆలోచిస్తున్నా. నాకు చుట్టాలయింటికి వెళ్ళటమంటే చాలాసరదా. ఇంతట్లోకే మాతాతయ్య కారు దిగి యింటికి వస్తున్నాడు. రోడ్డుమీదేచూచీ, చూడ్డంతోటే పరుగెత్తుకుంటూ వెళ్లి మా అమ్మచెవుల్లో ఊదేశాను. ఒకవేళ వంట కాకపోతే మామూలుబట్టవిడిచి మడిబట్ట కట్టుకుంటుందిగదా అని. మాతాతయ్య మడి భోజనం చేస్తాడుగా మరి. మాఅమ్మ చెంబుతో నీళ్లు తీసుకువచ్చి 'ఎప్పుడొచ్చావు నాన్నా అమ్మవాళ్లుఅంతా బాగావున్నారా' అని అడిగి నీళ్లిచ్చింది కాళ్లు కడుక్కోమని. వాళ్లు ఏదో మాట్లాడుతున్నారు. ఈలోగా మాతమ్ముడు నేను మాతాతయ్య తెచ్చిన పెట్టెని సాయంపట్టి యింట్లో పెట్టేశాము. తాతయ్య తెచ్చిన మిఠాయిపొట్లం అందరం పంచుకుతిన్నాము. మధ్యాహ్నం భోంజేసేటప్పుడు పండుగకు మాఅమ్మని, మాఅక్కని నన్ను తమ్ముణ్ని తీసికెడతానని మానాన్నగారితో చెప్పాడు తాతయ్య. మానాన్నగారు సరేనన్నారు. ఆసాయంత్రమే మాప్రయాణం.

మేము మాతాతగారి ఊరికివచ్చి మూడు రోజులయింది. అంటే నిన్ననే పండుగన్న మాట. ఇంకా మూడేరోజులుంది మా నాన్నగారు తిరిగి రావటానికి యిచ్చిన గడువు. మాతాతగారివూరు ఏలూరికి పది మైళ్ళలోవుంది. కాని మావూరికి చాలా దూరం. అందుకని 'ఇవ్వాళ ఏలూరువెళ్లి సినిమా చూచి రేపువచ్చేద్దాము' అని మామయ్య అమ్మ అనుకున్నారు. సాయంత్రం మూడుగంటలబండికి వెళితే రెండాటలు చూడవచ్చునని ఆబండికే వెళ్ళటానికి నిశ్చయమైంది. ఇంతట్లోకే 'ఎవరెవరు వెళతారమ్మా' అని మా అమ్మమ్మ అడిగింది. మేము నలుగురుమూను తమ్ముడూను వెళతామని చెప్పింది మా అమ్మ. 'ఏమిటీ పెద్దమ్మాయిని కూడ తీసికెళతారా? వద్దు యీడువచ్చినపిల్ల రేపోమాపో అంటూవుంది. ఏమోఎటుబోయి ఎటువస్తుందో ఎవరికి తెలుసు దిగబెట్టడం చాలామంచిది' అని మా అమ్మమ్మ అంది. ఔను నిజమే అనుకున్నారు. ఈమాట ఎప్పుడువిన్నదో మా అక్కకు కోపము సిగ్గుకూడ వచ్చేసినయ్ ఒక్కపెట్టున. వెంటనే యింట్లోకి వెళ్లిపోయింది. నేనూ వెళ్లాను. గదిలోకివెళ్లి మంచం మీద బోర్లపడుక్కొనిఉంది. ఉడుకుబోత్తనం వచ్చింది కాబోలు తనని తీసికెళ్లరని అని అనుకున్నా. నెమ్మదిగా దగ్గిరికెళ్లి 'అక్కా' అని పిలిచాను.

"ఎందుకేంటి" అని కోపంగా అంది.

"పడుక్కున్నావేమే?"

"ఏమీలేదు నీవువెళ్లు అవతలికి."

"మరి ఏలూరురావే నువ్వు?"

"అఖ్ఖర్లే మీరే వెళ్లండి" అంది. ఆ మాటలో ఉక్రోషుతనం కనబడుతుంది.

"ఎందుకురావు?"

"అవతలకుఫో నీకు చెప్పేదేమిటి?"

ఓహో, యీావిడకు కోపము అధికంగా వచ్చేసిందే, యీావిడగారు అలిగికూచుంటే మా సినిమా ఉట్టిదవుతుందేమో అని అనిపించింది నాకు. మాఅక్క అసలు పెంకి, పెంకి అంటేరణ పెంకి. చిన్నప్పుడు చాలాదెబ్బలు తినేదట. ఈవిడగారితో మాబావ ఎట్లా వేగుతాడోగాని మానాన్నగారుకూడ చాలాసార్లు కోపపడుతూంటారు. పెంకితనం చేస్తుందని. మరి నువ్వోఅని అడక్కండేంనన్ను. అది వేరేసంగతి. సందర్భంవచ్చింది గనక చెప్పానుగాని లేకపోతే మాఅక్కంత మంచిమనిషి ప్రపంచములో లేనే లేదందును. మాఅక్క అలిగి కూచుంటే మాఅమ్మ ప్రయాణం మానేస్తుంది. ఎట్లాగయినా సినిమా చూడాలి. నెమ్మదిగా దగ్గరకూచుని.

"అక్కా నువ్వు అలిగిపడుక్కుంటే, అమ్మ మానేస్తుందే. నీమూలాన మేంఅందరము మానాలి, ఎట్లాగయినా మాప్రయాణము ఆగకుండా చెయ్యవే. మేం వెళ్లిన తరువాత అలుగుదుగానిలే పోనీ"అన్నా.

"ఏడిశావులే అవతలకు దయచెయ్యి నువ్వు చెప్పేదానవా?' అని కసిరింది. నాకెందుకు చెప్పవలసినమాట చెప్పానుగదా అనుకుని వెళ్లిపోయా.

తరువాత అక్కకు కోపమొచ్చి అలిగిందని మాఅమ్మకు తెలిసి పోనీ దానినికూడా [illegible]కెళదాములే అని వెళ్లి బతిమాలింది. 'నిన్ను తీసుకుని వెళ్లము, అని అనలేదుగా. పధ్నాలుగేళ్లపిల్లను నిన్ను తీసుకెళ్లడము మంచిదికాదేమోనని అమ్మమ్మ అంది. అంతేగా! నేను తీసుకెళతానన్నానుగా, యీామాత్రానికే అలగాలా? తప్పు అలాఅలగ్గూడదు. లేచి తెల్లబట్టలుకట్టుకో బండివేళవుతుంది." అని ఈవిధంగా చాలాసేపు బతిమాలింది. ఊ, ఊ, వినలే. ఆఖర్కి విసుగొచ్చి "పోనీ నువ్వురాకపోతే మానేలే, మేమే వెళతాము" అంది. అంతవరకు సినిమాకు మానవలసివస్తుందేమోనని బెంగతోనున్న నేను ఈమాట వినేటప్పటికి మనస్సుకుదుటబడేసుకున్నా. ఇంట్లో ఉన్న వాళ్లందరూ ఒక్కొక్కరేతరగతి వారీగా బతిమాలారు. పూర్వపుజవాబే వాళ్లకుకూడాను. మా అమ్మమ్మకూడా చెప్పింది. 'నేను అల్లాఅనటము తప్పేలే. ఫరవాలేదులే వెళ్లు' అని. నేనుకూడా చెప్పాను 'యిటువంటి ఛాన్సు పోగొట్టుకోగూడదు' అని. కాని నాకూ అదేజవాబు. అందరకంటే నేను ఎక్కువా?

మూడుగంటలబండికి మాఅమ్మ నేను తమ్ముడు మామామయ్యా వెళ్లాముఏలూరు. వెళ్లేటప్పుడుకూడా అడిగాము వస్తాదేమోనని. రానంది మాఅక్క. పోనీలే మాకూ నయమే ఒకరూపాయి మిగులుతుంది అని అనుకున్నా నాలోనేను.

మేంవెళ్లినతరువాత ఏమనుకుందో కాని మాఅక్క తాతయ్యతోటి "తాతయ్యా మనమిద్దరము ఎనిమిదిగంటలకో చీకి

సినిమాకు వెళదామా''అని అడిగిందట. ''సినిమా అది ఎక్కడుందో తెలియదమ్మా నాకు'' అన్నాడుట తాతయ్య.

''ఆ తెలిసేదేమిటి బండీవాడే తీసికెడతాడు.''అని అందుట. దానికి కూడా తాతయ్య ''నాదగ్గర ఒక్కరూపాయికూడా లేదు'' అంటే ''అక్కర్లేదు నాదగ్గర 3 రూపాయీలున్నయి. నీకు నాకు సరిపోతయ్యిలే''అందిట. అప్పుడు తాతయ్యేమో ''ఏమోనమ్మా రాత్రిప్రయాణం నేను చెయ్యలేను. మరి అంతాచూడాలని ఉంటే యిందాక వెళ్ళలేకపొయ్యావ్రా అధిక బెట్టుసరి చేసావెందుకూ''అన్నాడుట. పాపం మా అక్కయ్య ఉత్సాహంఅంతా దాంతో అణిగిపోయింది. ఏంచేస్తుంది? యిదంతా మేం మళ్ళీవచ్చిం తర్వాత తెలిసింది నాకు.

ఏలూరులో మా పెద్దమామయ్య ఉన్నాడు. కాని వాళ్ళకు అసలు కనపడకుండానే వచ్చేద్దామనుకున్నాము. కాని ఆయనా ఆవేళే సినిమాకు రావటంవల్ల మమ్మల్నిచూచి వాళ్ళింటికి తీసికెళ్ళాడు. ఆవేళ వాళ్ళింట్లోనేఉండి రెండోరోజున కూడా సినిమాచూసి మూడోరోజున వచ్చాము. వచ్చేటప్పుడు మాఅమ్మకి మాకూను మంచిమంచి బట్టలు అవ్వీకొనిపెట్టాడు మామయ్య. నాకుమట్టుకు సిల్కుగౌను సిల్కులంగా కుట్టించాడు. మరి వాళ్ళింటి కెళ్ళి ఏపదేళ్ళయిందో మాఅమ్మ.

మేము యింటికి వచ్చింతరువాత నేనూ మాతమ్ముడూను సినిమాసంగతులు, మా మయ్యగారి యింటిదగ్గర సంగతులుచెపుతో ఉంటే, ఒక్కొక్కమాటకు మా అక్క మొఖంలో ఒక్కొక్క తెరమారుతూంది. నేను వెళ్ళకపోయానే అని అనుకుంటుంది కాబోలు. నేను అనుకున్నట్టే ''అయ్యో నేను కూడా వెళ్ళకపోయానే''అని అంది మా అక్క యిక పశ్చాత్తాపం పట్టలేక.

''మరి నేరమ్మంటే వచ్చావా మేము వెళ్ళేటప్పుడెట్లాఉన్నావో యిప్పుడు అట్లాగే ఉన్నావు మరి బెట్టుసరి యెందుకుచెయ్యాలి'' అని అన్నా: ఆమాటకు అందరూ నవ్వారు. మాఅక్కమాత్రం నవ్వలా.ఆవిడ మొఖంలో ''యింతబెట్టుసరి యెప్పుడూచెయ్యగూడదురా''అని అనుకుంటూన్నట్టు తోస్తుంది భావం.

ఆవిడేకాదు స్త్రీలలో చాలామంది మాటకుముందు అలగడం బెట్టుసరిచెయ్యడం తరువాత పశ్చాత్తాపపడటం మామూలు. మరి నాకుమట్టుకు అలగటంఅంటే మహా చిరాకు.

బెట్టుసరి అన్నమాటలోనేఉంది అర్థం అట్టు—సరి అంటే బెట్టుసరిగా చెయ్యాలి. అంటే అంత ఎక్కువకాకుండా అంతతక్కువ కాకుండాలని. ఇంతకీ యేమిటంటే బెట్టుసరి పనికిరాదనికాదు.

చెయ్యవలసినచోట చెయ్యవచ్చునుగాని
చేయరానిచోట చేయరాదు
చేయవచ్చుచేయరాదు, చేయకపోరాదు.

అని.

గుడిమెట్ల మంగమ్మ.